## నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

ఘట్‌కేసర్‌: విద్యుత్‌ లైన్లకు మరమ్మతుల కారణంగా ఘట్‌కేసర్‌ 33/11కేవీ విద్యుత్‌ సబ్‌ స్టేషన్‌ బాలాజీనగర్‌ 11కేవీ ఫీడర్‌ పరిధిలో శనివారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, అంకుషాపూర్‌ 33/11కేవీ విద్యుత్‌ సబ్‌ స్టేషన్‌ చందుపట్లగూడ ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్‌ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఘట్‌కేసర్‌ ఏఈ యశ్వంత కుమార్‌రెడ్డి తెలిపారు.

## సన్నబియ్యం పంపిణీలో ఆలస్యం వద్దు




సాక్షి, సిటీబ్యూరో: సన్నబియ్యం పంపిణీలో అలస్యం జరగకుండా జిల్లా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ సన్నబియ్యం పంపిణీలో రేషన్‌ షాపుల డీలర్లు అవకతవకలకు పాల్పడినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారిని ఆదేశించారు. అధికారులంతా సమష్టిగా పనిచేసి సకాలంలో సన్నబియ్యం పంపిణీ అయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్‌(రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్‌ సుగుణాబాయి పాల్గొన్నారు.

## గురుకుల్‌ అభివృద్ధి కోసం ఉత్తరాల ఉద్యమం



ఘట్‌కేసర్‌: పట్టణంలోని గురుకుల్‌ను అభివృద్ధి చేయాలని పూర్వవిద్యార్థుల ఉత్తరాల ఉద్యమం ఘనంగా కొనసాగుతుంది. గురుకుల్‌కు పూర్వవైభవం తేవాలని, గురుకుల్‌ ఆవరణలో నిర్మాణాలు చేపట్టి పేద విద్యార్థులకు కేజీ–పీజీ వరకు ఉచిత విద్య అందజేయాలని సీఎం రేవంత్‌రెడ్డి, కేబినెట్‌ మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు శుక్రవారం లేఖలు పంపారు. కార్యక్రమంలో యాదగిరియాదవ్‌, వెంకటేశ్‌, ఇమ్ము, శ్రీనివాస్‌గౌడ్‌, సురేశ్‌, నరేశ్‌, సాయి, శ్రీనివాస్‌, కేపా, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## అంబేడ్కర్‌ను అవమానిస్తే ఊరుకోం..



ఉప్పల్‌లో మాట్లాడుతున్న పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్‌: భారత రాజ్యాంగ నిర్మాత డా.అంబేడ్కర్‌ను ఆయన రాసిన రాజ్యాంగాన్ని అవమానిస్తే సహించేది లేదని పలువు కాంగ్రెస్‌ నాయకులు హెచ్చరించారు. జైబాపు, జైభీం, జైసంవిధాన్‌ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉప్పల్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉప్పల్‌ భగాయత్‌లోని శ్రీరస్తు కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ కో–ఆర్డినేటర్‌ శోభారాణి మాట్లాడుతూ బీఆర్‌ అంబేడ్కర్‌ను అవమానించేలా పార్లమెంట్‌లో హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా అమిత్‌షా రాజీనామా చేయాలని ఒత్తిడి చేస్తూ జైబాపు, జైభీం, జైసంవిధాన్‌ నినాదాన్ని ముందుకు తీసుకొచ్చినట్లు తెలిపారు. హోం మంత్రి వ్యాఖ్యలను ప్రతి ఒక్కరూ తిప్పి కొట్టాలని సూచించారు. బీజేపీ దాని అనుబంధ సంస్థల దాడులను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మందముల రజిత, బొంతు శ్రీదేవి, నేతలు తౌఫిక్‌, అంజిరెడ్డి, రాజేందర్‌, ధన్‌పాల్‌రెడ్డి, లింగంపిల్ల రామకృష్ణ, గణేష్‌ నాయక్‌ తదితరులు పాల్గొన్నారు

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

అల్వాల్‌: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన అల్వాల్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ మల్లేష్‌ తెలిపిన వివరాల ప్రకారం.. పి.సూర్య(25), నరేష్‌ గురువారం మధ్యాహ్నం మచ్చబొల్లారం సంజీవరెడ్డినగర్‌లో నివాసముండే స్నేహితుడి దగ్గరికి వెళ్లి తిరిగి వస్తుండగా మచ్చబొల్లారం బాలాజీ హైస్కూల్‌ వద్ద ఎదురుగా వెళ్తున్న ట్యాంకర్‌ను ఓవర్‌ టేక్‌ చేస్తుండగా ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీ కొటింది. దీంతో సురేష్‌ కుడివైపు రోడ్డుపై పడిపోగా వెనుక కూర్చున్న సూర్య ట్యాంకర్‌ చక్రాల కింద పడ్డాడు. తీవ్ర గాయాలపాలు కాగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రకృతి వనరుల ధ్వంసం!

## పర్యావరణానికి పెను ముప్పు

ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన కొండల(గుట్టల) ఆనవాళ్లు లేకుండా పోతున్నాయి. నగర శివారు చుట్టుపక్కల ఉన్న గుట్టలన్నీ కరిగిస్తూ వచ్చిన రాబంధుల కన్ను ఇప్పుడు మట్టి రవాణాపై పడింది. రేయింబవళ్లూ మట్టి తవ్వి తరలిస్తూ రూ.లక్షల్లో ఆర్జిస్తున్నారు. పొక్లెయిన్లతో తవ్వకాలు చేస్తూ.. టిప్పర్ల ద్వారా తరలిస్తూ గుట్టల ఆనవాళ్లు లేకుండా చేస్తున్నారు. మట్టిని రవాణా చేస్తున్న వ్యక్తులకు రాజకీయ నేతల అండదండలు ఉండటంతో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రకృతి వనరులు ధ్వంసం అవడమే కాకుండా వ్యాపారులు రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. మరోవైపు మైనింగ్‌ శాఖకు రాయల్టీ రూపంలో రావాల్సిన డబ్బు కూడా రాకుండా పోతోంది.

– సాక్షి, సిటీబ్యూరో



పోచారంలో..

- కంకర, మట్టి, గుట్టల తవ్వకాల్లో ఇష్టారాజ్యం
- లోయలు, కుంటలను తలపిస్తున్న క్వారీ గుంతలు
- ప్రమాదాలకు నిలయాలుగా మారడంతో ఆందోళన
- ఉల్లంఘనలతో.. ప్రమాదాలకు నిలయంగా..
- శివారుల్లో కొనసాగుతున్న 188 కంకర, రాయి, ఇతర క్వారీలు

◆ మట్టి రవాణా చేయాలంటే నిబంధనల ప్రకారం మొదట మైనింగ్‌ శాఖ ఏడీకి దరఖాస్తు చేసుకోవాలి. వచ్చిన దరఖాస్తును మైనింగ్‌ శాఖ దరఖాస్తుదారు మట్టి రవాణాకు సూచించిన ప్రాంతంపై పరిశీలనకు సంబంధిత రెవెన్యూశాఖకు పంపిస్తారు. అక్కడి నుంచి ఎన్‌వోసీ వచ్చిన తర్వాత మళ్లీ దరఖాస్తును మైనింగ్‌ శాఖకు నివేదిస్తారు. మైనింగ్‌ శాఖ సిబ్బంది మళ్లీ క్షేత్రస్థాయికి వెళ్లి మట్టి రవాణాకు అనుకూలమా లేదా పరిశీలించి అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది.

### గ్రేటర్‌ శివారు ప్రాంతాలలో 188 క్వారీలు

నగర శివారులలో అధికారికంగా 188 క్వారీలు ఉండగా, అనధికారికంగా రెటింపు స్థాయిలో నడుస్తున్నట్లు తెలుస్తోంది. మేడ్చల్‌ జిల్లాలో కీసర, మేడ్చల్‌, శామీర్‌పేట, ఘట్‌కేసర్‌ మండలాల పరిధిలో 36 క్వారీలు(35 రాయి, ఒకటి కంకర) నడుస్తుండగా, రంగారెడ్డి జిల్లాలో 152 క్వారీలు(ఇందులో 82 రాయి, కంకర, 15 గ్రానైట్‌, 52 పలుగు రాయి, ఫెల్డ్‌పార్‌, 3 లాటరైట్‌) కొనసాగుతున్నాయి. రాయల్టీ చెల్లింపు, కొలతలు(లెక్కలు), రెన్యూవల్‌ తదితర పేరిట క్వారీ వ్యాపారులపై తీవ్ర ఒత్తిడి పెరగడంతో.. ఇందులో చాలా మేరకు క్వారీలు రెన్యూవల్‌ చేసుకోలేదని తెలుస్తోంది. మరికొన్ని మూసివేత దిశలో కొనసాగుతున్నట్లు పేర్కొంటున్నారు. అలాగే, 2024–25 ఆర్థిక సంవత్సరానికి శివారు రంగారెడ్డి, మేడ్చల్‌ జిల్లాలలో గనులు, భూగర్భ శాఖకు ఆదాయం రాబడి 70 నుంచి 80 శాతం మించలేదని తెలుస్తోంది. ఇదిలా ఉండగా.. లీజు పేరిట ఏళ్ల తరబడి కంకర, ఇతర తవ్వకాలు చేపట్టి రూ.లక్షలు కూడబెట్టుకున్న వ్యాపారులు నిబంధనలకు నీళ్లు వదులుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో లీజు పూర్తయిన క్వారీలన్నీ పెద్దగుంతలు, లోయలుగా మారి ప్రమాదాలు నిలయాలుగా మారుతున్నాయి.

### ప్రమాదం ముంచుకొస్తోంది..

కంకరతో సహా రాయి తవ్వకాలతో గుట్టలన్నీ మాయం కావడంతో పర్యావరణకు ప్రమాదం ముంచుకొస్తోంది. లీజు పేరిట సాగుతున్న అక్రమ దందాలో నిబంధనల ఉల్లంఘనలే కనిపిస్తున్నాయి. గ్రామ, పట్టణ రెవెన్యూ పరిధిలో పట్టా భూములున్న రైతుల దగ్గర లీజు అగ్రిమెంట్లు చేసుకోవడం, మైనింగ్‌ శాఖ నుంచి తవ్వకాలకు అనుమతులు పొంది కంక తరలించడం ఏళ్లుగా సాగుతోంది. ప్రభుత్వ భూములను లీజుకు తీసుకుని క్వారీ నడిపిన కాంట్రాక్టర్లు పనులు పూర్తి కాగానే.. రెవెన్యూ శాఖకు అప్పగించడంతో.. వాటికి రక్షణ కంచెలు వేయడం లేదా వదిలి పెట్టడం చేస్తున్నారు. గాజులరామారం, కుత్బుల్లాపూర్‌, రాంపల్లి ప్రాంతాల్లో క్వారీ పనులు పూర్తయిన తర్వాత ఆ గుంతలను చెత్తతో నింపి డంపింగ్‌ యార్డులను మరిపిస్తుండగా, నిజాంపేట, మౌలాలీ, అంకిరెడ్డిపల్లి, పోచారం ప్రాంతాల్లోని క్వారీ గుంతలు ఇంకా అలాగే ఉండిపోయాయి. ప్రైవేట్‌ భూములను లీజుకు తీసుకుని క్వారీలు నడిపిన కాంట్రాక్టర్లు కూడా వాటిని గాలికి వదిలి వేస్తున్నారు.



అంకిరెడ్డిపల్లిలో..

### ప్రమాదాలకు నిలయంగా..

క్వారీల్లో తవ్వకాలు పూర్తయిన తర్వాత నిబంధనల ప్రకారం అక్కడ గుంతలను మట్టితో పూడ్చాలి. కానీ ఇవన్నీ ఎక్కడా అమలు కావడం లేదు. శివారులో చాలా క్వారీలను ఇలాగే వదిలేయడంతో లోయలు, కుంటలను తలపిస్తున్నాయి. 2 ఎకరాల విస్తీర్ణంలోని పదుల మీటర్ల లోతులో ఉన్న గుంతలు ప్రమాదకరంగా మారాయి. దీంతో చుట్టుపక్కల పల్లెలు, బస్తీ ప్రజలు ఈ ప్రాంతాల్లో నివసించాలంటే భయపడుతున్నారు. దుండిగల్‌, కీసర, ఘట్కేసర్‌, శామీర్‌పేట, మేడ్చల్‌, మేడిపలి, అబ్దుల్లాపూర్‌మేట్‌, కొత్తూరు, గండిపేట, ఇబ్రహీంపట్నం తదితర మండలాల పరిధిలోని కంకర క్వారీల్లో ప్రమాదాలు జరిగాయి. ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కూలీలు పలువురు క్వారీ గుంతల్లో పడి మృతి చెందిన ఘటనలు ఉన్నాయి. శివారుల్లో పోచారం తదితర కొన్ని చోట్ల పోలీసులు ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా పట్టించుకుంటున్న దాఖలాలు కనిపించడం లేదు. క్వారీ గుంతల్లో జరిగే ప్రమాదాలు పోలీస్‌ స్టేషన్లలో నమోదైతే తప్ప బయటపడని ప్రమాదాలు అనేకం ఉన్నట్లు తెలుస్తోంది. శివారుల్లో అక్రమ కంకర, మట్టి ఇతర రాయి తవ్వకాలపై అధికార యంత్రాంగం దృష్టి సారించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



పోచారంలో..

## ప్రభుత్వ భూమిలో బోర్డు ఏర్పాటు



పోచారం: నారపల్లిలోని సర్వే నంబర్‌–56లో గల ప్రభుత్వ భూమిలో రెవెన్యూ అధికారులు శుక్రవారం బోర్డును ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్‌ డీఎస్‌ రజిని హెచ్చరించారు. 15 రోజుల క్రితం ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన బోర్డును భూకబ్జాదారులు తొలగించడం పట్ల ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. బోర్డు ఏర్పాటు పనులను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ సాయిరాం, జూనియర్‌ అసిస్టెంట్‌ శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షించారు.

## రెచ్చిపోయిన శునకాలు



కుక్కల దాడిలో గాయపడిన బాలుడు

మేడ్చల్‌రూరల్‌: గుండ్లపోచంపల్లి, మేడ్చల్‌ మున్సిపాలిటీల్లో శుక్రవారం శునకాలు రెచ్చిపోయాయి. రోడ్డుపై వెళ్తున్న పలువురిపై దాడి చేసి గాయపర్చాయి. వివరాల్లోకి వెళితే గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి గౌడవెల్లి గ్రామంలో నివాసం ఉండే బీహార్‌ రాష్ట్రానికి చెందిన తల్లీ కొడుకులు సాయంత్రం కిరాణా షాపునకు వెళ్లేందుకు గౌడవెల్లి రైల్వే స్టేషన్‌ వద్దకు చేరుకోగా కుక్కలు ఒక్కసారిగా వారిపై దాడి చేశాయి. వెంటనే ద్విచక్రవాహనంపై వెళ్తున్న కాంగ్రెస్‌ మేడ్చల్‌ మండల అధ్యక్షుడు రమణారెడ్డిపై దాడి చేశాయి. కుక్కల దాడిలో ముగ్గురు తీవ్ర గాయాలపాలయ్యారు. బాధితులు మేడ్చల్‌లోని ప్రైవేట్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మేడ్చల్‌ మున్సిపల్‌ పరిధిలోని కిందిబస్తీలో జరిగిన మరో ఘటనలో కుక్కల దాడిలో లక్ష్మీనర్సింహ అనే యువకుడు గాయాలపాలై చికిత్స పొందుతున్నాడు. మేడ్చల్‌, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీల పరిధిలో పదుల సంఖ్యలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# చైన్‌ స్నాచింగ్‌ నిందితుడికి రిమాండ్‌



కేసు వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ రాములు

శామీర్‌పేట్‌: ఈజీ మనీకి అలవాటుపడి చోరీల బాట ఎంచుకున్నాడు ఆ వ్యక్తి. ఏడేళ్ల క్రితం హోంగార్డుగా విధులు నిర్వర్తించే సమయంలో లైంగికదాడి కేసులో ఉద్యోగం పోయింది. వారం రోజుల క్రితం శామీర్‌పేట పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో ఓ వృద్ధురాలి మెడలోంచి బంగారు గొలుసు అపహరించి పరారైన నిందితుడు శామీర్‌పేట పోలీసులకు చిక్కాడు. శామీర్‌పేట పోలీస్‌ స్టేషన్‌లో శుక్రవారం కేసు వివరాలను పేట్‌బషీరాబాద్‌ ఏసీపీ రాములు వెల్లడించారు. గతనెల 28న తూంకుంట మున్సిపాలిటీ, దొంగలమైసమ్మ చౌరస్తా వద్ద ధర్మారం వెళ్లేందుకు వరలక్ష్మీ అనే వృద్ధురాలు బస్సు కోసం ఎదురుచూస్తోంది. తుకారంగేట్‌, అడ్డగుట్టకు చెందిన నరేష్‌కుమార్‌(42) ద్విచక్రవాహనంపై వచ్చి ఇంటి వద్ద దింపుతానని, నేను పోలీస్‌ అని నమ్మించి బైక్‌పై ఎక్కించుకున్నాడు. కొంత దూరం వెళ్లాక బైక్‌ను ఆపాడు. అనుమానం వచ్చిన వృద్ధురాలు నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వచ్చి మెడలోని 2 తులాల గొలుసును తెంపుకొని పారిపోయాడు. కేసు నమోదు చేసుకున్న శామీర్‌పేట పోలీసులు వారం రోజుల్లో నిందితుడిని అరెస్ట్‌ చేశారు. నిందితుడిపై మరిన్ని కేసులు నమోదైనట్లు తెలుస్తోందని, కస్టడీకి తీసుకొని విచారణ చేస్తామని ఆయన తెలిపారు. సుమారు 600 కెమెరాలను పరిశీలించామని, ఈ సందర్భంగా పోలీస్‌ సిబ్బందిని ఏసీపీ రాములు అభినందించారు.

## కల్యాణ మహోత్సవ వేడుకలు



కల్యాణ మహోత్సవ కరపత్రికను ఆవిష్కరిస్తున్న మంజుల రమేష్‌యాదవ్‌

బోడుప్పల్‌: సాయిభవానీ నగర్‌ కాలనీలోని స్పటిక లింగేశ్వర సహిత సీతారామాంజనేయ ఆలయంలో ఈ నెల 6వ తేదీన సీతారామచంద్ర స్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్‌ జడిగె మంజుల రమేష్‌యాదవ్‌ వెల్లడించారు. ఈ సందర్భంగా బోడుప్పల్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 6 గంటలకు శ్రీసీతారామచంద్రస్వామి వారికి మహాభిషేకం, 8గంటలకు పూజ, 10.30 గంటలకు ఎదుర్కోలు, 11గంటలకు శ్రీసీతారామచంద్ర స్వామి కల్యాణోత్సవం, 12.30 గంటలకు మహా నైవేద్యం నివేదన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి రాహుల్‌ శర్మ పాల్గొన్నారు.

# కారిడార్‌ నిర్మాణ పనులు.. ఇంకెన్నాళ్లు..?



ఉప్పల్‌ తహసీల్దార్‌ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేస్తున్న అఖిల పక్షం నేతలు

ఉప్పల్‌: ఉప్పల్‌ టు నారపల్లి ఎలివేటెడ్‌ కారిడార్‌ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటాన్ని నిరసిస్తూ ఉప్పల్‌ అఖిలపక్షం ఆధ్వర్యంలో నేతలు, స్థానికులు, వివిధ పార్టీల నేతలు, వర్తక సంఘం నేతలు, ఉప్పల్‌లో శాంతి ర్యాలీ నిర్వహించారు. నినాదాలు చేస్తూ ఉప్పల్‌ తహసీల్దార్‌ కార్యాలయానికి చేరుకుని కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ ఆరేళ్లుగా ఇక్కడ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం దుమ్ముధూళితో అనేక మంది రోగాలతో ఇబ్బంది పడుతున్నారని, త్వరగా కారిడార్‌ పనులు పూర్తి చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో మేకల శివారెడ్డి, అఖిలపక్షం నాయకులు మేకల మధుసూదన్‌రెడ్డి, మేకల హన్మంత్‌రెడ్డి, కందికంటి అశోక్‌ గౌడ్‌, బజారు గజన్నాథ్‌, మహంకాళి నర్సింహ, జెల్లి మోహన్‌ దాస్‌ గౌడ్‌, సుధాకర్‌ గుప్తా, బింగి భరత్‌, నెర్ధం భాస్కర్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తిపన్నుపై 5 శాతం రాయితీ

బోడుప్పల్‌: బోడుప్పల్‌ నగర పాలక సంస్థ పరిధిలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి ఆస్తిపన్ను చెల్లింపుపై 5 శాతం రాయితీ కల్పించినట్లు కమిషనర్‌ శైలజ వెల్లడించారు. బోడుప్పల్‌ నగర పాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, కమిషనర్‌, డైరెక్టర్‌ ఆఫ్‌ మున్సిపల్‌ అడ్మినిస్ట్రేషన్‌ వారి ఉత్తర్వుల మేరకు ఈ రాయితీని కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఈ రాయితీ పొందేందుకు యజమానుదారులు 2025–2026 ఆర్థిక సంవత్సరానికి ఆస్తిపన్ను, బకాయిలను పూర్తిగా ఈ నెల 30వ తేదీలోపు చెల్లించాలన్నారు. 5 శాతం రాయితీ కల్పించడం ముఖ్య ఉద్దేశ్యం యజమానుదారులపై ఆర్థిక భారాన్ని తగ్గించడమేనన్నారు. ఆస్తిపన్ను ఆన్‌లైన్‌ ద్వారా, బిల్‌ కలెక్టర్లకు, మున్సిపల్‌ పౌరసేవా కేంద్రం నుంచి గానీ చెల్లించి రాయితీని పొందాలన్నారు. మరింత సమాచారం కోసం రెవెన్యూ విభాగంలో లేదా పౌర సేవ కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. సకాలంలో ఆస్తిపన్ను చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు.

## విద్యార్థులను క్రీడల్లోనూ ప్రోత్సహించాలి

బోడుప్పల్‌: విద్యార్థులను చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని జేజీఆర్‌ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్‌ గంగరాజు అన్నారు. బృందావన్‌ కాలనీలోని జేజీఆర్‌ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన క్రీడాపోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, మ్యూజికల్‌ చైర్స్‌, రన్నింగ్‌, ప్రైమరీ విద్యార్థులకు పన్నీ గేమ్స్‌ నిర్వహించినట్లు వెల్లడించారు. విద్యార్థుల మానసిక ఉల్లాసానికి, ఆరోగ్య పరిరక్షణకు క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి విజయకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## హెచ్‌సీయూలో భూముల వేలం ఖండిస్తున్నాం

అల్వాల్‌: హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీ(హెచ్‌సీయూ) పరిధిలోని 400 ఎకరాల భూములను రాష్ట్ర ప్రభుత్వం వేలం వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సీపీఎం మల్కాజిగిరి మండల కార్యదర్శి గుంటి లక్ష్మణ్‌ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ భూములను అమ్మడం ద్వారా ఆదాయం సమకూర్చుకోవాలని కాంగ్రెస్‌ ప్రభుత్వం యోచిస్తోందని, ప్రభుత్వమే రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారం చేస్తుంటే ప్రభుత్వ ఆస్తులకు రక్షణ ఎక్కడ ఉందన్నారు. వెంటనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విద్యార్థులను విడుదల చేసి వారిపై పెట్టిన కేసులను ఎత్తివేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న భూముల అమ్మకం నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్‌ చేస్తున్నాం.

# సెలవు రోజుల్లోనూ.. ప్రజాపాలన కేంద్రాలు




సాక్షి, సిటీబ్యూరో: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాల ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన రాజీవ్‌ యువ వికాసం పథకం ప్రకటించిందని, సెలవు రోజుల్లో కూడా ప్రజాపాలన కేంద్రాలు పనిచేస్తాయని, ఆఫ్‌లైన్‌ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని మేడ్చల్‌– మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్‌(లోకల్‌ బాడీ) రాధికగుప్తా తెలిపారు. కలెక్టరేట్‌ నుంచి మున్సిపల్‌ కమిషనర్లతో ఆమె టెలీ కాన్ఫరెన్స్‌ శుక్రవారం నిర్వహించారు. రాజీవ్‌ యువ వికాసం పథకాన్ని ఎక్కువ మంది నిరుద్యోగులు ఉపయోగించుకోవాలనే ఉద్దేశ్యంతో ఈ నెల 14 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించిందని ఆమె అన్నారు. ప్రజాపాలన కేంద్రాల వద్ద ఆన్‌లైన్‌లోనే కాకుండా ఆఫ్‌ లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. సెలవు రోజుల్లో కూడా ఈ కేంద్రాలు పని చేస్తాయన్నారు. ఆఫ్‌లైన్‌లో స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్‌ చేసి జాగ్రత్తగా భద్రపరచాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. మున్సిపల్‌, ఎంపీడీవో కార్యాలయ స్థాయిలో ప్రచారం చేసి అధిక సంఖ్యలో దరఖాస్తులు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్‌ సూచించారు. 25 శాతం సింగిల్‌ ఉమెన్‌, వితంతువులు, 5 శాతం దివ్యాంగులకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూర్చనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

# ఆదర్శంగా రైతుసేవా సహకార సంఘం



శామీర్‌పేట సొసైటీ కార్యాలయాన్ని సందర్శిస్తున్న సబితాఇంద్రారెడ్డి

శామీర్‌పేట్‌: రాష్ట్రంలోనే శామీర్‌పేట రైతుసేవా సహకార సంఘం ఆదర్శంగా ఉందని, మాజీ మంత్రి, రాజేంద్రనగర్‌ ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. తూంకుంట మున్సిపాలిటీ, శామీర్‌పేటలోని మండల వ్యవసాయ సహకార సంఘం కార్యాలయాన్ని ఆమె శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సంఘం పరిధిలో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలపై డీసీఎంఎస్‌ వైస్‌ చైర్మన్‌ మధుకర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఐదు సంవత్సరాల్లో రైతులకు అందిస్తున్న సేవలు, గోదాముల నిర్మాణాలు, లాకర్స్‌ సౌకర్యాలను ఆమె సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. మూడుచింతలపల్లిలో సొసైటీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడంపై మధుకర్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు మహేష్‌రెడ్డి, ఆనంద్‌, రోహిత్‌ రెడ్డి, సొసైటీ వైస్‌ చైర్మన్‌ ఐలయ్య, డైరెక్టర్లు భూమిరెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పరిశ్రమలకు నిపుణులు అవసరం



నమూనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పోచారం: పరిశ్రమల్లో పనిచేసేందుకు నిపుణుల అవసరం ఎంతో ఉందని నల్లమల్లారెడ్డి విద్యా సంస్థల డైరెక్టర్‌ దివ్య నల్ల అన్నారు. నల్ల మల్లారెడ్డి ఇంజినీరింగ్‌ కళాశాలలో 'పరిశ్రమలు – కళాశాలల అనుసంధానం'పై శుక్రవారం జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. ఇంజినీరింగ్‌, ఎంబీఏ కళాశాలల విద్యార్థులను పారిశ్రామికవేత్తలుగా, బలమైన ఉద్యోగులుగా రూపొందించడమే సదస్సు ముఖ్య లక్ష్యమన్నారు. కళాశాలలు, పరిశ్రమలకు మధ్య వారధిగా పనిచేయడానికి 'ఇండస్ట్రీ ఇన్‌స్టిట్యూట్‌ మీట్‌' ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు పరిశ్రమల్లో ఎప్పటికీ అవకాశాలు ఉంటాయని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు ప్రాజెక్టులకు చెందిన నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్తలతో పాటు కళాశాలకు చెందిన హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.